# దొడ్డిదారిన 'ఎగ్జిట్ పాలసీ'

## నూతన పారిశ్రామిక సంబంధాల బిల్లు

నూతన ఆర్థిక విధానం పరిపూర్ణంగా అమలు కావాలంటే కార్మికులను కట్టుదిట్టంగా నియంత్రించాలనే అవగాహన ప్రభుత్వానికి స్పష్టంగా ఉంది. ఉత్పత్తి పెరగాలి, ఉత్పత్తి పెరుగుదల రేటు అభివృద్ధి చెందాలి, ఎగుమతులు పెరగాలి, విదేశీ మారక ద్రవ్యం దేశంలోకి, రావాలి, విదేశీ పెట్టుబడులు,సాంకేతిక సామర్థ్యం నిస్సంకోచంగా దేశంలోకి ప్రవహించాలి – ఇదీ ప్రభుత్వం లక్ష్యం. దీనికి ప్రభుత్వం దృష్టిలో ఆటంకంగా కనిపించే వాటిలో ఒకటి కార్మిక వర్గానికి ఉండే హక్కులు. ముఖ్యంగా 'ఉద్యోగ భద్రత ' అనేది పెద్ద ఆటంకంగా భావిస్తున్నారు. ఇప్పుడు కార్మికులకు పెద్దగా ఉద్యోగ భద్రత ఉందని కాదు. కానీ కార్మికులను లే ఆఫ్ చేయాలన్నా రిట్రెంచ్ చేయాలన్నా కంపెనీనే మూసేయాలన్నా యాజమాన్యం కొన్ని నియమాలను పాటించవలసిఉంది. ఆ నియమాలను తొలగించడం 'ఎగ్జిట్ పాలసీ' లక్ష్యం. పెట్టుబడి ఎప్పటికప్పుడు ఎదుర్కొనే సంక్షోభాన్ని బట్టి స్వేచ్ఛగా కార్మికుల భారాన్ని తొలగించుకునే అవకాశం ఇవ్వకపోతే లాభార్జనకు, దేశపురోభివృద్ధికి, విదేశీ ద్రవ్యం సముపార్జనకు (ప్రస్తుతం అన్నిటికంటే ఇది ముఖ్యం కదా) పెద్ద ఆటంకం అయిపోతుందని పెట్టుబడిదార్లు చాలాకాలంగా చేస్తున్న వాదన ఇప్పుడు ప్రభుత్వ విధానం కానుంది. దీని పేరే ఎగ్జిట్ పాలసీ.

పెట్టుబడిదార్లకు ఉన్నా లేకపోయినా ప్రభుత్వానికి ప్రజల జీవితాలపట్ల బాధ్యత ఉందనేది భారత రాజ్యాంగంలోని ప్రాథమిక లక్ష్యం. ఆ బాధ్యతే లేకపోతే రాజ్యాంగంలోని నాలుగవ అధ్యాయం ('ఆదేశిక సూత్రాల అధ్యాయం') ఉండేదేకాదు. నిరుద్యోగం, పేదరికం ప్రధానంగా ఉన్నదేశంలో కార్మికులను ఇష్టమొచ్చినట్టు తీసేసే అధికారం, కంపెనీలు ఇష్టమొచ్చినట్టు మూసేసే అధికారం యజమానులకు ఉండరాదనీ, ఆ పరిస్థితి వస్తే ప్రభుత్వం అనుమతి మీదనే జరగాలనీ ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వివాదాల చట్టం (ఐ.డి.చట్టం) భావిస్తుంది.

సెక్షన్ 25 M ప్రకారం , ఏదయినా ప్రకృతి వైపరీత్యం వంటి బాహ్యకారణాల ఫలితంగా కాక ఇతరత్రా కార్మికులను లేఆఫ్ చేయాలంటే యాజమాన్యం ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి. ప్రభుత్వానికి అప్లికేషన్ పెట్టుకోవాలి. ప్రభుత్వం దానిపైన విచారణ జరిపి యాజమాన్యం చెప్పే కారణాలలోని మంచి చెడులనేకాక కార్మికుల అవసరాలను, ఇతర సంబంధిత విషయాలను దృష్టిలో పెట్టుకొని అనుమతి ఇచ్చేదీలేనిదీ నిర్ణయించాలి. ప్రభుత్వం నిర్ణయం అంతిమ తీర్పు అవుతుంది.

సెక్షను 25 N ప్రకారం ఒక సంవత్సరంపైగా వరుసగా పనిచేస్తున్న కార్మికుడిని తొలగించాలంటే (రిట్రెంచ్ చేయాలంటే) మూడు నెలల నోటీస్ ఇవ్వడమే కాక ముందుగా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి. ప్రభుత్వం ఇరువైపులా వాదనలు విని తీసుకునే నిర్ణయం అంతిమ నిర్ణయం అవుతుంది.

సెక్షన్ 25 O ప్రకారం ఒక కంపెనీని మూసివేయాలని యాజమాన్యం భావిస్తే కనీసం 90 రోజులు ముందే ప్రభుత్వానికి అప్లికేషన్ పెట్టుకోవాలి. ప్రభుత్వం అటు యజమానుల వాదనలను ఇటు కార్మికుల వాదనలను, ఆ విషయంలో ఆసక్తి గల వారందరి వాదనలను ఆలకించి 'ప్రజల ప్రయోజనాలతో సహా అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకొని' అనుమతి ఇచ్చేదీ లేనిదీ నిర్ణయిస్తుంది. ఇదే అంతిమ నిర్ణయం అవుతుంది.

పెట్టుబడి దాని యజమానుల స్వంత ఆస్తి కావచ్చుగానీ దానికి సామాజిక బాధ్యత ఉందనీ ఆ బాధ్యతను యజమానులు కాకపోతే ప్రభుత్వమైనా నిర్వర్తించాలనీ ఈ చట్టాలు గుర్తించాయి. బాధ్యతను తప్పించుకోవడానికి ప్రభుత్వానికయినా యజమానులకయినా మార్గాలు లేవని కాదు. ప్రభుత్వ అధికారులకు కంపెనీ యజమానులకు మామూలుగా ఉండే లాలూచీ అటుంచి, సెక్షన్ 25 M లోని హక్కు మస్టర్ రోల్ లో వున్న కార్మికులకే వర్తిస్తుంది. కొద్దిమంది నిపుణులయిన కార్మికులను మట్టుకే మస్టర్ రోల్ లో చూపించి మిగిలిన వాళ్ల పేర్లే లేకుండా చేయడం చాలా కంపెనీలలో నిత్యం అమలవుతున్న మోసమే. అదేవిధంగా సెక్షన్ 25 N ఒక సంవత్సరం వరుసగా పనిచేసిన కార్మికులకే వర్తిస్తుంది . నిజంగానే పని చేసినా చేయనట్టు చూపించడం, మధ్యలో పనిమానేయడానికి బాధ్యత కార్మికునిది కాకపోయినా కార్మికునిదే అయినట్టు చూపించడం యజమానులకు సులభమే.కంపెనీ మూసివేతకు ప్రభుత్వం అనుమతి అడగకుండా తాళం వేసి వెళ్లిపోతే తాళాలు తీయమని ప్రాధేయపడడం తప్ప ప్రభుత్వం చేయగలిగింది ఏమీలేదన్న సంగతి సెక్షన్ 25 O లో లేకున్నా అది వాస్తవం అని వెల్లిమర్ల జూట్ మిల్లు యజమాన్లు ఇప్పటికి రెండుసార్లు రుజువు చేసారు.

అయినప్పటికీ ప్రభుత్వానికి కార్మికులపట్ల, సమాజం పట్ల ఉన్న ఈ బాధ్యతలను గుర్తించడం ఒక ప్రజాస్వామిక విలువను గుర్తించడం , ఒక ప్రజాస్వామిక హక్కును గుర్తించడం. నూతన ఆర్థిక విధానంలో భాగంగా అన్ని ప్రజాస్వామిక విలువలపైన, హక్కులపైన జరుగుతున్న దాడులతో బాటు ఈ బాధ్యతకు కూడ తిలోదకాలిచ్చే ప్రయత్నం ఇప్పుడు జరుగుతూ ఉంది. కార్మికులను తీసుకోవడంలో, తొలగించడంలో, లాభసాటి కాని కంపెనీలను మూసేయడంలో , లాభసాటి అయిన చోటికి పెట్టుబడిని తరలించడంలో పెట్టుబడిదార్లకు స్వేచ్ఛ లేకపోవడంవల్ల దేశ పారిశ్రామిక పురోభివృద్ధి దెబ్బతింటూ ఉందనీ, పాశ్చాత్య దేశాలలో ఈ స్వేచ్ఛ ఉండడం వల్ల మనం వాళ్లతో పోటీ పడలేకుండా ఉన్నామనీ భారతదేశ పెట్టుబడిదార్లు చాలా కాలంగా వాదిస్తున్నారు. తెలుగు దినపత్రికలు అనువదించి ప్రచురిస్తున్న భారతీయ జనతా పార్టీ జాతీయనాయకుడు జయ్‌దుబాషి వ్యాసాలు చదివిన వారికి ఈ వాదన సుపరిచితమే. ఈ స్వేచ్ఛ పేరే 'ఎగ్జిట్ పాలసీ'.

ఈ ఎగ్జిట్ పాలసీతో పాటు పారిశ్రామిక వివాదాల చట్టంలో అనేక ఇతర మార్పులను ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడొక కొత్త పారిశ్రామిక సంబంధాల బిల్లును తయారుచేసింది. కార్మికుల హక్కులను – ముఖ్యంగా సమ్మె చేసే హక్కును – కుదించే పారిశ్రామిక సంబంధాల బిల్లును అప్పటి కేంద్ర ప్రభుత్వం (జనతా పార్టీ ప్రభుత్వం) 1978లోనే ప్రవేశ పెట్టింది. ఆ

తరువాత అదే లక్ష్యంతో, మరికొంత పరిమితమైన పరిధిలో, ఆస్పత్రులు ఇతర సంస్థల బిల్లును ఇందిరాగాంధి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కార్మిక వర్గం, ప్రజాతంత్ర శక్తులు దేశవ్యాప్తంగా ఆందోళన చేయగా ఆ ప్రయత్నాలు ఆగిపోయాయి. 'అత్యవసర సర్వీసుల' లో సమ్మెలను నిషేధించి సమ్మెచేసే కార్మికులను ముందు జాగ్రత్త చర్యగా నిర్బంధించే 'ఎస్మా'మట్టుకు 1980లో చట్టరూపం తీసుకుంది.

అయితే అప్పటికీ ఇప్పటికీ పరిస్థితి మారింది. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధుల షరతుల ఫలితంగా కార్మికుల హక్కులను అణచివేయడంలో 'అర్జెన్సీ' పెరిగింది. దేశం దివాలా తీస్తూ ఉంది అనే వాదనతో కార్మికుల నోళ్లు ప్రశ్నించే వాళ్లనోళ్ళు మూయించే అవకాశం పెరిగింది. అంతర్జాతీయ ద్రవ్యసంస్థల మద్దతుతో భారత దేశ పెట్టుబడిదార్ల ఆత్మస్థైర్యం పెరిగింది.

ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం పాత పారిశ్రామిక సంబంధాల బిల్లుకు ఎగ్జిట్ పాలసీ నిబంధనలను చేర్చి ఇప్పుడు ప్రతిపాదిస్తూ ఉంది. కేంద్ర కాబినెట్ దీనిని ఆమోదించింది. ఇది ఏ రోజయినా చట్టం కావచ్చు. దీనిలోని ముఖ్య అంశాలను గమనిద్దాం.

## వివాదాల పరిష్కారం

ఒక పరిశ్రమలో కార్మికులకూ యజమాన్యానికీ మధ్య వచ్చే వివాదాలను పారిశ్రామిక వివాదాలు అంటారు. ఇది వేతనాల గురించి కావచ్చు, బోనస్ గురించి కావచ్చు , పనిపరిస్థితుల గురించి కావచ్చు, పని భారాన్ని గురించి కావచ్చు, కార్మికుల లేఆఫ్ లేక తొలగింపు (రిట్రెంచ్‌మెంట్) గురించి కావచ్చు, వేరే ఏదయినా కావచ్చు. ఈ వివాదాల పరిష్కారానికి లేబర్ కోర్టులు, ట్రిబ్యునల్స్ ఉన్నాయి. అయితే రిట్రెంచ్‌మెంట్ వంటి కొన్ని విషయాల గురించి తప్ప సాధారణంగా కంపెనీలలో తలెత్తే ఇతర పారిశ్రామిక వివాదాల గురించి నేరుగా ఈ లేబర్‌కోర్టుకు లేక ట్రిబ్యునల్‌కు పోయి కేసువేసుకునే హక్కు కార్మికులకు లేదు. అట్లాగని సమ్మెవంటి పోరాట రూపాలను ఆశ్రయించే హక్కుకూడ కార్మికులకు నిర్ద్వంద్వంగా లేదు. అన్ని వివాదాలను చర్చలద్వారా, సంప్రదింపులద్వారా పరిష్కరించుకోవాలనేది పారిశ్రామిక వివాదాలచట్టం సారాంశం. ఈ రకంగా తెగకపోతే, అప్పుడు కోర్టుకు నివేదించమని కార్మికులు ప్రభుత్వాన్ని కోరుకుంటే – లేక కోర్టుకు నివేదించడం అవసరం అని ప్రభుత్వానికే తోస్తే – అప్పుడు వివాదం కోర్టుముందుకు పోతుంది. ఇంక సమ్మె విషయాని కొస్తే చట్టం కళ్లకు అది సమస్యలకు పరిష్కారంగా కనిపించదు. నిరోధించవలసిన ఒక నేరంగా కనిపిస్తుంది. సమ్మెలద్వారా గానీ కోర్టుకేసుద్వారా గానీ కాక సంప్రదింపుల ద్వారా వివాదాలు పరిష్కారం కావాలనే సూత్రం ఇరుపక్షాలు ఆ సమానశక్తి గల వాళ్లయినప్పుడు న్యాయమయినదేగానీ ఒకరు బలవంతులు ఒకరు బలహీనులు అయినప్పుడు చాలా సందర్భాలలో అన్యాయానికే దారితీస్తుంది. కార్మికులకు సంబంధించినంతవరకు ఈ అన్యాయం ఇప్పటికే చట్టంలో వ్యవస్థీకృతమయి ఉంది.

కొత్తగా ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పారిశ్రామిక సంబంధాల చట్టం ఈ అన్యాయాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. న్యాయమూర్తులు అధికారులుగా ఉన్న లేబర్ కోర్టులను, ట్రిబ్యునల్స్‌ను తొలగించి వాటి స్థానంలో ఒక న్యాయమూర్తి, ఇద్దరు ప్రభుత్వ అధికారులు ఉన్న పారిశ్రామిక సంబంధాల కమిషన్ (ఇండస్ట్రియల్ రిలేషన్స్ కమిషన్) ను నెలకొల్పనున్నారు. దీనిపేరులోనే 'కోర్టు' అన్న మాట తొలగించి 'కమిషన్' అంటున్నారు. దానికి తగ్గట్టు ఆ కమిషన్‌లో ఒక న్యాయమూర్తితో బాటు ఇద్దరు ప్రభుత్వ అధికారులు ఉంటారు. వాళ్ల దగ్గర పిటిషన్ వేసుకోవడమంటే కోర్టులో కేసు వేసుకోవడం కాదు, తాసీల్దారుకు అర్జీపెట్టుకోవడం లాంటిది.

అయితే ప్రస్తుత పారిశ్రామిక వివాదాలచట్టంలో లేబర్‌కోర్టుకు నేరుగా పోయే హక్కు చాలా సందర్భాలలో లేనట్టే, కొత్త బిల్లులో కూడ ఈ కమిషన్‌కు నేరుగా అర్జీపెట్టుకునే హక్కు కార్మికులకు లేదు. ముందు యాజమాన్యానికే అర్జీపెట్టు కోవాలంట. మళ్లీ రెండవసారి పెట్టుకోవాలంట. ఆ తరువాత ఇరుపక్షాలు ఒప్పుకునే మధ్యవర్తి(ఆర్బిట్రేటర్) దగ్గరికి పోవాలంట. అప్పటికీ పరిష్కారం కాకపోతే చర్చలు నిర్వహించడానికి ప్రతి కంపెనీలోను ఒక సంప్రదింపుల సమితి(నెగోషియేటింగ్ కౌన్సిల్) ఉంటుందంట. ఈసమితిలో సగం మంది యాజమాన్యం ప్రతినిధులు, సగం మంది కార్మికప్రతినిధులు ఉంటారు. ఈ సమితి నిర్వహించే సంప్రదింపుల వల్ల వివాదం పరిష్కారం కాకపోతే, ఇంక అప్పుడే ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌లాగ పనిచేసే పారిశ్రామిక సంబంధాల కమిషన్ దగ్గరికి వివాదాన్ని తీసుకుపోవాలి. ఈ కమిషన్ ఇచ్చే తీర్పు అంతిమ తీర్పు. దానిపైన హైకోర్టుకుగానీ సుప్రీంకోర్టుకుగానీ అప్పీల్ లేదు.

కార్మికుల సమస్యలేవీ కూడ కోర్టు ముఖం చూడకుండా యాజమాన్యం చేతిలోనూ బ్యూరోక్రసీ చేతిలోనూ పరిష్కారం కావాలనేది దీని సారాంశం. న్యాయాన్ని న్యాయస్థానంలో పొందే హక్కు, న్యాయస్థానాలకు ప్రామాణికమైన రాజ్యాంగ మౌలిక సూత్రాల రక్షణ పొందే హక్కు స్మగ్లర్లకూ దొంగసారా వ్యాపారస్తులకూ నల్లబజారు సేఠ్‌లకూ ఉంటుంది గానీ కార్మికులకు మట్టుకు ఉండదు. ఇది ఇప్పటికే చాలా వరకు ఉన్న పరిస్థితి. నూతన పారిశ్రామిక సంబంధాల చట్టం దీనిని పరిపూర్ణం చేయనుంది.

'ఎగ్జిట్ పాలసీని' దీనిలోనే ఇరికించారు. ఇప్పుడున్న పారిశ్రామిక వివాదాల చట్టంలోని సెక్షన్లు 25 – M, 25 –N, 25 – Oలను పైన వివరించాము. లేఆఫ్‌కు, రిట్రెంచ్‌మెంట్‌కు, కంపెనీమూసివేతకు ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనేది ఆ సెక్షన్ల సారాంశం. కొత్త పారిశ్రామిక సంబంధాల బిల్లు

*అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడింది. అందులో సభ్యత్వం తీసుకున్న మొదటి దేశాలలో భారతదేశం ఒకటి. అప్పటి బ్రిటిష్ వలస ప్రభుత్వం 1919–1947ల మధ్య 18 ఐఎల్ఒ నిబంధనలపైన సంతకం చేసింది. స్వతంత్ర భారత ప్రభుత్వం 1947–1976ల మధ్య మరొక 12 నిబంధనలపైన సంతకం చేసింది. 1976 తరువాత ఒక్క నిబంధన పైన కూడ భారత ప్రభుత్వం సంతకం చేయలేదు.*

*ఐఎల్ఒ ఎప్పటికప్పుడు చేసే అన్ని నిబంధనలపైన భారత ప్రభుత్వం సంతకం చేసి అమలు చేయాలనేది అన్ని కార్మిక సంఘాల డిమాండు.*

ఆ 'భారాన్ని ' ప్రభుత్వం మీదనుండి తొలగించి సంప్రదింపుల సమితి మీద పెడుతుంది. అంటే కంపెనీ యాజమాన్యం పై విషయాలలో అనుమతి ప్రభుత్వం నుండి తీసుకోనవసరం లేదు. అదే కంపెనీకి చెందిన సంప్రదింపుల సమితి అనుమతి తీసుకుంటే చాలు! ఈ సమితిలో ఉండేది సగంమంది అదే యాజమాన్యం ప్రతినిధులు, సగంమంది కార్మిక ప్రతినిధులు. ఈ కార్మిక ప్రతినిధులను కొనేయవచ్చు, ఉద్యోగాల నుండి పీకేస్తామని బెదిరించవచ్చు, గూండాలను పెట్టి కొట్టించవచ్చు, ఇంకా అనేక రకాలుగా లొంగదీసుకోవచ్చు.

## సంఘటితమయ్యే హక్కు

సంఘటితమయ్యే హక్కుపైన, ఆందోళన చేసే హక్కుపైన ఇప్పటికే చట్టంలో ఎన్నో ఆంక్షలున్నాయి. చర్చలు, సంప్రదింపులు జరుగుతుండగా సమ్మె చేయడానికి వీలులేదు. లేబర్ కోర్టుకు వివాదాన్ని నివేదించిన తరువాత సమ్మె చేయడానికి వీలులేదు. ఒక ఒప్పందం అమలులో ఉన్నకాలంలో సమ్మె చేయడానికి వీలులేదు. ఇదంతాకాక 14 రోజుల నోటీస్ ఇవ్వకుండ సమ్మె చేయడానికి వీలులేదు. (పారిశ్రామిక వివాదాల చట్టం, అయిదవ అధ్యాయం, సెక్షన్లు 22, 23)

దీనినిప్పుడు కొత్త బిల్లులో మరింత కఠినం చేయనున్నారు. 14 రోజుల నోటీసును ఒక నెల నోటీసుగా మారుస్తున్నారు. పైగా కంపెనీ కార్మికులలో 2/3వ వంతు సమ్మెకు మద్దతుగా వోటు వేస్తేనే సమ్మె చట్టబద్ధం అవుతోంది. అంటే ఇప్పటికే 'చట్టబద్ధంగా' సమ్మె చేయడం దాదాపు అసాధ్యంగా ఉన్న పరిస్థితిలో దానిని పూర్తిగా అసాధ్యం చేయదలచుకున్నారు.

సంఘం పెట్టుకునే హక్కుపైన కూడ కొత్త బిల్లు దాడి చేస్తూ ఉంది. ఇప్పుడున్న చట్టం ప్రకారం ఏడుగురు సభ్యులుంటే చాలు ఒక సంఘాన్ని రిజిస్టర్ చేయడానికి. కొత్తగా ప్రతిపాదిస్తున్న బిల్లులో, ఆ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులలో 10శాతం సభ్యులయితే తప్ప ఆ యూనియన్‌కు రిజిస్ట్రేషన్ ఇవ్వకూడదంటున్నారు. యూనియన్‌ల నాయకత్వం పైన కూడ ఆంక్షలు పెడుతున్నారు. కార్మిక ఉద్యమానికి సమర్థులయిన నాయకత్వం లోపం చాలా ఉంది. అందువల్ల ఒకే వ్యక్తి చాలా యూనియన్లకు నాయకత్వం వహించడం పరిపాటి. కొత్త బిల్లులో ఒక వ్యక్తి 7కంటె ఎక్కువ సంఘాలలో నాయకత్వ స్థానంలోఉండకూడదని ప్రతిపాదిస్తున్నారు. కంపెనీ చట్టం ప్రకారం ఒక వ్యక్తి 20 కంపెనీలలో డైరక్టర్‌గా ఉండవచ్చునన్నప్పుడు, కార్మిక సంఘాల నాయకులకు మట్టుకు ఈ పరిమితి ఎందుకు? అని కార్మిక ఉద్యమకారులు సహేతుకంగా ప్రశ్నిస్తున్నారు.

నాయకత్వంపైన ఇంతకంటె ఘోరమైన పరిమితి మరొకటి ఈబిల్లులో ఉంది. ఏదయినా నైతిక అక్రమానికి పాల్పడిన వ్యక్తిగానీ ఒక నేరానికి శిక్షపడిన వ్యక్తిగానీ యూనియన్ నాయకులుగా ఉండడానికి వీలు లేదని బిల్లు అంటుంది. తప్పుడు ఆరోపణలు వేసి తప్పుడు సాక్ష్యాలు సృష్టించడం, తప్పుడు కేసులలో శిక్షవేయించడం యాజమాన్యాలకు అసాధ్యం కాదు. అంతేకాక, వివాదాల నేపథ్యంలో ఒక్కొక్కసారి భౌతిక ఘర్షణలు అనివార్యం అవుతాయి. దానికి కోర్టు శిక్ష వేయవచ్చు.. అటువంటి వ్యక్తి నాయకత్వ అర్హత కోల్పోయినట్టేనా?

అయినా కార్మిక సంఘాల ఏర్పాటులోగానీ నిర్వహణలోగానీ ప్రభుత్వం ఏరకంగానూ జోక్యం చేసుకోరాదనేది అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) నిబంధనలలో ఒకటి. ఆ రకంగా చూస్తే ఈ ప్రతిపాదనలన్నీ అంతర్జాతీయ నిబంధనలకు వ్యతిరేకమే.

# 'ఎన్‌కౌంటర్' అప్‌డేట్

ఫిబ్రవరి నెలలో జరిగిన ఒక 'ఎన్‌కౌంటర్' గత సంచికలోనూ, ఆసియావాచ్ నివేదిక తెలుగు అనువాదానికి అనుబంధంగా వేసిన జాబితాలోను చోటుచేసుకోలేదు.

వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం ఊరుగొండకు చెందిన ముప్పుమొగిలిని ఫిబ్రవరి 17 రాత్రి పోలీసులు ఇంటి నుండి తీసుకుపోయి 18 తెల్లవారి ఊరిబయట ఉన్న దేవుని గుట్ట వద్ద కాల్చేసారు.

ఇకపోతే మార్చి-ఏప్రిల్ నెలలలో మొత్తం 14 'ఎన్‌కౌంటర్లు' జరిగాయి. 22మంది చనిపోయారు.

వరంగల్ జిల్లా నర్మెట్ట మండలంలోని నెల్లండ (నర్రా ప్రభాకరరెడ్డి స్వగ్రామం)కు చెందిన కాసర్ల కనకయ్యను మార్చి 12 తెల్లవారుజామున పోలీసులు అతని ఇంట్లోనుండి నిద్రలేపి తీసుకుపోయారు. కొద్ది గంటలలోపలే అదే మండలంలోని అబ్దుల్ నాగారం దగ్గర కాల్చేసారు.

ఆదిలాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని మంగి గ్రామానికి చెందిన రాయి సిడాం బల్లార్షా అనే గోండు యువకుడిని పోలీసులు మార్చి నెల మొదటి వారంలో అతని స్వగ్రామంలోనే అరెస్టు చేసి రెండు వారాలకుపైగా తమ నిర్బంధంలోనే ఉంచుకొని మార్చి 21 రాత్రి అదే మండలంలోని పంగిడి గుట్ట దగ్గర కాల్చేసి 'గుర్తు తెలియని తీవ్రవాది' అన్నారు. ఒక నెలరోజులదాకా అతని ఫొటోకూడ పేపర్లకు ఇవ్వలేదు. ఆ తరువాతే చనిపోయింది అతనని అతని తల్లిదండ్రులకు తెలిసింది.

శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలంలోని దేవునల్తాడ – భవనపాడు గ్రామాల మధ్య మార్చి 21 తెల్లవారుజామున పోలీసులు మద్దు ధనరాజ్‌ను కాల్చిచంపారు. అదే మండలం గడూరు గ్రామ నివాసి అయిన ధనరాజ్ కొన్నాళ్లగా ఆరోగ్యరీత్యా గుజరాత్‌లో బంధువుల దగ్గర ఉంటున్నాడు. ఒకప్పుడు నక్సలైట్ కార్యకలాపాల్లో పాల్గొని మానేసాడు. ఇంటివాళ్లను చూడడానికి అతను గ్రామానికి తిరిగి రాగా 21 పొద్దున్న 3గంటలకు ఊరివాళ్లంతా చూస్తుండగా పోలీసులు అతన్ని గడూరులోనే అరెస్టుచేసి తీసుకుపోయి పైనచెప్పిన ప్రాంతంలో కాల్చేసారు.

ఆదిలాబాద్ జిల్లా మందమర్రి సమీపంలో మార్చి 28 తెల్లవారుజామున పోలీసులు కొప్పుల శంకర్ అనే యువకుడిని కాల్చేసారు. మందమర్రికి చెందిన శంకర్ ఒకసంవత్సరంగా హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్ ప్రాంతంలో ఉంటున్నాడు. పోలీసులతన్ని మార్చి 26న హైదరాబాద్‌లోనే అరెస్టుచేసి ఆదిలాబాద్ జిల్లాకు తీసుకుపోయి 27వ తేదీన దేవాపూర్, మందమర్రి పోలీస్టేషన్లలో ఉంచి 28 తెల్లవారుఝామున మందమర్రి సమీపంలోని రైల్వేగేట్ దగ్గర కాల్చేసారు.

వరంగల్ జిల్లా పరకాల మండలంలో మహదేవ్‌పూర్ రహదారిపైనున్న చలివాగు వద్ద ఏప్రిల్ 2వ తేదీ తెల్లవారుజామున పోలీసులు ముగ్గురిని కాల్చేసారు. మృతులు రేగొండ మండలం చిన్నకోడెపాకకు చెందిన మాడ సంతోష్, ఏటూర్ నాగారం మండలం

(మిగతా 16వ పేజీలో) ☞